క్లుప్తంగా...

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ చైర్మన్ జుర్కీ రాజేందర్ కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి విన్నవించారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని సందర్శించాలన్నారు. ఆలయ ప్రహరీతో పాటు శిథిలావస్థకు చేరకున్న కల్యాణ మండపాన్ని కూడా పునర్నిర్మించాలని కోరారు.

కార్వాన్‌లో ఎమ్మెల్యే పర్యటన



టోలిచౌకీ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకీ, మెరాజ్ కాలనీ, లక్ష్మీనగర్, గోల్కొండ రేతిగల్లి, కార్వాన్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాలకు బుల్కాపూర్ నాలా పొంగిపొర్లుతుందని ఈ విషయంపై తాను బల్దియా కమిషనర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించానన్నారు. వెంటవెంటనే బుల్కాపూర్ నాలాలో పూడికతీత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నదీమ్ కాలనీలో శాతం చెరువుకు ఆనుకొని ఉన్న ఇళ్లు ముంపునకు గురికాకుండా వరద నీటిని వెంటవెంటనే విడుదల చేస్తున్నామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

వినాయక ఉత్సవాల్లో స్వదేశీ వస్తువులనే వినియోగించాలి



మాట్లాడుతున్న ప్యారసాని వెంకటేష్

చార్మినార్: వినాయక ఉత్సవాల సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా స్వదేశీ వస్తువులను వినియోగించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు ప్యారసాని వెంకటేష్ పిలుపునిచ్చారు. ఉత్సవ సమితి మొఘల్‌పురా డివిజన్ కమిటీ కన్వీనర్ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో మొఘల్‌పురాలో జరిగిన గణేష్ ఉత్సవ సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పూజా సామగ్రితో పాటు వినాయకుడి ప్రతిష్టాపన, మండపాలతో పాటు సామూహిక ఊరేగింపులో సైతం స్వదేశీ వస్తువులను మాత్రమే వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రూప్‌రాజ్,ముఖేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కబూరీకి నగర విద్యార్థుల ఎంపిక



గన్‌ఫౌండ్రీ: ఈ నెల 15 నుంచి శ్రీలంకా స్కౌట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగబోయే 14వ జాతీయ కబూరీకి నగరానికి చెందిన ఎంఎస్ ఎడ్యుకేషన్ అకాడమీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంఎస్ క్రియేటీవ్ స్కూల్‌కు చెందిన సఫ్వాన్ ఖురేషి, ఇంతియాజ్ అఫాన్‌లు ఎంపిక కావడంపై పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పోషకాహార ఉత్పత్తులకే ఓటు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర ఉత్పత్తులనే కోరుకుంటున్నారని పోషకాహార నిపుణులు అన్నారు. ఎలక్ట్రోలైట్ డ్రింక్ తయారీకి పేరొందిన ప్రముఖ బ్రాండ్ ఓఆర్ఎస్ఎల్ చక్కెర రహితంగా రూపొందిన తమ తాజా ఉత్పత్తి ఓఆర్ఎస్ఎల్ జీరోను సిటీ మార్కెట్లోకి విడుదల చేసింది. సిటిజనుల్లో, ముఖ్యంగా చిన్నారుల్లో హైడ్రేషన్ సమస్యకు ఓఆర్ఎస్ చక్కని పరిష్కారంగా వక్తలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. తాజా ఉత్పత్తిలో చక్కెర జీరో శాతంగా ఉందని, అలాగే సహజమైన మామిడి గుజ్జును వినియోగించడం వల్ల క్యాలరీలపై అవగాహన ఉన్నవారికి అత్యంత అనువైనదిగా ఓఆర్ఎస్ఎల్ జీరో ఎలక్ట్రోలైట్ డ్రింక్‌ను కెన్వ్యూ ఇండియా, సెల్ఫ్-కేర్ బిజినెస్ హెడ్ ప్రశాంత్ షిండే పేర్కొన్నారు.

నాలా ఇలా.. నీరు పారేదెలా?

ఓపెన్ నాలాల్లో పేరుకుపోతున్న చెత్త

- పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సాఫీగా సాగని వరద నీరు
- జలమయమవుతున్న పరిసర ప్రాంతాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



యాకుత్‌పురా-డబీర్‌పురా ప్రధాన రోడ్డులోని ఓపెన్ నాలాలో పేరుకుపోయిన చెత్త

చార్మినార్: వర్షం వస్తే చాలు పాతబస్తీలోని ఓపెన్ నాలాలు పొంగి పరిసరాలను ముంచెత్తుతున్నాయి. ఓపెన్ నాలాల్లో వరద నీరు సకాలంలో ముందుకు వెళ్లలేక నాలా పక్కనున్న పరిసరాలు జలమయమవుతున్నాయి. దీంతో అటువైపు నుంచి రాకపోకలు స్తంభించడమే కాకుండా ఇళ్లల్లోకి వరద నీరు చేరుతోంది. వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపట్టినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. పూడికతీత పనుల పేరుతో టెండర్లు కాజేస్తున్న కొంతమంది కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో పాటు సిబ్బంది సరైన చర్యలు తీసుకోకపోవడంతో వర్షా కాలంలో స్థానికులకు సమస్యల తిప్పలు తప్పడం లేదు.

పూర్తిస్థాయిలో పూడికతీత పనులు..

పూర్తిస్థాయిలో పూడికతీత పనులు జరగకపోవడంతో భారీగా వర్షాలు కురిసినప్పుడు వరద నీరు సక్రమంగా వెళ్లడానికి వీలు లేకపోవడంతో ఆయా పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమవుతున్నాయి. ఓవైపు వర్షపు నీటితో రోడ్లన్నీ జలమయం అవుతుండగా.. మరోవైపు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి మురుగునీరు వరద నీటితో కలిసిపోవడంతో వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.

లోపిస్తున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

ప్రతి ఏడాది వర్షా కాలానికి ముందే సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు పూడికతీత పనుల కోసం నిధులను వినియోగిస్తున్నారు. ఈ నిధుల వినియోగం సక్రమంగా జరగడం లేదు. నామ మాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్న కాంట్రాక్టర్లపై సంబంధిత ఉన్నతాధికారుల నిఘా కొరవడుతోంది. దీంతో తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు. పూడికతీత పనులు సక్రమంగా జరగకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటే సమస్యలు ఉత్పన్నం కావని లోతట్టు ప్రాంతాల బాధితులు అంటున్నారు.

ప్రజల్లో అవగాహన అవసరం..

ఓపెన్ నాలాల్లో స్థానికులు తమ ఇళ్లల్లోని చెత్తాచెదారం వేయకుండా ఉండాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. ఓపెన్ నాలాలకు ఇరువైపుల గృహాలు నిర్మించుకుని జీవిస్తున్న స్థానిక ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఎట్టి పరిస్థితులలో చెత్త వేయొద్దు. ఒకవైపు ప్రభుత్వం ఓపెన్ నాలాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తుండగా..మరోవైపు స్థానికులు తమ ఇళ్లు, దుకాణాల్లోని పనికిరాని చెత్తను ఓపెన్ నాలాల్లో వేయడం సరైంది కాదంటున్నారు. అయితే ఓపెన్ నాలాల్లో చెత్త వేయకుండా స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉంది.

మురుగునీటి సమస్యకు పరిష్కారం



పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గౌలిపురా: అయోధ్యనగర్‌లో నెలకొన్న మురుగునీటి సమస్యను బుధవారం జలమండలి సిబ్బంది పరిష్కరించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అయోధ్యనగర్ తదితర ప్రాంతాల్లో మురుగునీరు ప్రవహిస్తుండటంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేటర్ జలమండలి డీజీఎంతో మాట్లాడి పొంగిపొర్లుతున్న మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో బుధవారం సిబ్బంది మురుగునీటి సమస్యను పరిష్కరించారు. బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గం మాజీ కన్వీనర్ గౌలీకర్ ధీరజ్‌లాల్, బీజేపీ నాయకులు జమాల్‌పూర్ అశోక్, రఘుకాంత్, కె.రాజ్ కుమార్, జి.నర్సింగ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వెంకటేశ్వర్లు, ఎస్‌డిఎం.సుభాని, శ్రీనివాస్

నాంపల్లి: ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో నిర్వహించిన మాదకద్రవ్య వ్యతిరేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంతో పోలిస్తే నేడు మాదక ద్రవ్యాలు, గంజాయి విచ్చలవిడిగా వివిధ రూపాల్లో లభ్యమవుతుండటంతో యువకులు, విద్యార్థులు కూడా వీటికి బలైపోతున్నారన్నారు. జనరల్ మేనేజర్ కో ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని మాట్లాడుతూ..మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గు మార్కెటింగ్ శాఖాధిపతి తాడబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



యాకుత్‌పురా: ముంపు ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో గురువారం ఆయన రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తలాబ్‌కట్టా, భవానీనగర్, అమన్‌నగర్-ఏ, మౌలాకా చిల్లా, యక్రబ్‌నగర్, లండన్ బ్రిడ్జి, గంగానగర్ నాలా, మదీనానగర్, ధోబీఘాట్ ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తలెత్తున్నాయన్నారు. ఖూరిషిలైన్, గంగానగర్ నాలా ప్రాంతాల్లో కొనసాగుతున్న పైపులైన్ పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు.

బాధ్యతల స్వీకరణ



జోనల్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

చార్మినార్: జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ నూతన జోనల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. చాంద్రాయణగుట్ట సర్కిల్ పూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..జోన్ పరిధిలోని మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, పలు విభాగాల అధికారులు, ఉద్యోగులు జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాధనం దుర్వినియోగం

వర్షంలోనే సీసీ రోడ్డు పనులు.. కొట్టుకుపోయిన సిమెంటు



వర్షంలోనే వేసిన నూతన సీసీ రోడ్డు

గౌలిపురా: శిథిలావస్థకు చేరుకున్న రోడ్డును తవ్వి నూతన రోడ్డు వేస్తున్నారనుకున్న ప్రజలకు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల సమయంలోనే కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు జీహెచ్ఎంసీ అధికారులపై మండిపడ్డారు. గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్ కృష్ణవేణి స్కూల్ సమీపంలో లక్షలాది రూపాయలతో నూతన సీసీ రోడ్డు పనులను చేపడుతున్న కాంట్రాక్టర్‌ను స్థానిక ప్రజలు ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమధానం చెబుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సన్మానం



అఫ్జల్‌గంజ్: గోషామహల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును ఆర్టీఏ యాక్టివిస్ట్ అజిత్ హిందుజ ఆధ్వర్యంలో బుధవారం రామ్‌బిలాస్ శర్మ సత్కరించారు. అజిత్ హిందుజ మాట్లాడుతూ..మినీ ఇండియాగా భావించే గోషామహల్‌లో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు వివిధ ఉత్తమ సేవలందిస్తున్నారని కొనియాడారు.

మదీనాలో భారీ మువ్వన్నెల జెండా ప్రదర్శన



మహమ్మద్ క్యాప్ మార్ట్ షో రూంపై ప్రదర్శించిన మువ్వన్నెల జెండా

చార్మినార్: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని బుధవారం మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని మహ్మద్ ఇలియాస్ బుకారి అతి పెద్ద మువ్వన్నెల జెండాను ప్రదర్శించారు. 3,250 అడుగుల భారీ మువ్వన్నెల జెండాను తన షో రూంపై ఏర్పాటు చేశారు. గతేడాది 5 వేల అడుగుల మువ్వన్నెల జెండాతో మదీనా సర్కిల్ నుంచి చార్మినార్ కట్టడం వరకు భారీ జెండా ప్రదర్శన నిర్వహించిన మహ్మద్ ఇలియాస్ బుకారి ఈసారి భారీ వర్షాల నేపథ్యంలో తన షోం రూంపై మాత్రమే ప్రదర్శించారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి



సన్నాహక సమావేశంలో బీజేపీ నాయకులు

గోల్కొండ: తిరంగా ర్యాలీని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కార్వాన్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్ అన్నారు. కార్వాన్ శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో బుధవారం తిరంగా ర్యాలీపై సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాతీయ పతాకాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఈ సదుద్దేశంతోనే బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింగ్, కట్ల అశోక్, శివయాదవ్, జొన్నకుంటి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, నానల్ నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులతో పాటు బస్తీలు, కాలనీల అంతర్గత రహదారులు గుంతలమయంగా, చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. దీంతో 'సాక్షి'అధ్వాన రోడ్లతో అవస్థలు అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. స్పందించిన సంబంధిత అధికారులు బుధవారం ఉదయం టోలిచౌకీ-అక్బర్‌పురా మెయిన్‌రోడ్డుపై ఉన్న చెత్తను అధికారులు పూర్తిగా తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.



చెత్తాచెదారాన్ని శుభ్రం చేసిన సిబ్బంది

'క్రీడా'లో సుఖరక్షక్ ఏఐపై వర్క్‌షాపు



వర్క్‌షాపులో డాక్టర్ అలోక్ సిక్కా, డాక్టర్ గిరిరాజ్ అమర్‌నాథ్, క్రీడా అధికారులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ (క్రీడా)లో బుధవారం ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఐడబ్ల్యూఎంఐ), క్రీడా ఆధ్వర్యంలో భారతదేశంలో కరువు నిర్వహణ కోసం సుఖరక్షక్ ఏఐ (కృత్రిమ మేధస్సు)పై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. సుఖరక్షక్ ఏఐని కీలకమైన వాటాదారులకు అందించడం, వినియోగదారులు, నిర్ణయాధికారుల నుంచి అభిప్రాయాన్ని సేకరించడం, క్షేత్రస్థాయి విస్తరణ, స్కేలింగ్ కోసం సహ రూపకల్పన వ్యూహాలను రూపొందించడం ఈ వర్క్‌షాపు ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడబ్ల్యూఎంఐ, ఇండియా అండ్ బంగ్లాదేశ్ సీనియర్ ఫెలో, కంట్రీ రిప్రజెంటేటీవ్ డాక్టర్ అలోక్ సిక్కా, వాటర్ డేటా ఫర్ క్లైమేట్ రెసిలెన్స్, ప్రిన్సిపల్ రీసెర్చర్ అండ్ రీసెర్చ్ గ్రూపు లీడ్ డాక్టర్ గిరిరాజ్ అమర్‌నాథ్, ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ (క్రీడా) డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ తదితరుల పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహిత విద్యాలయాలుగా తీర్చిదిద్దుకోవాలి



ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వినోద్ గణేష్, ప్రొఫెసర్ సీహెచ్. శ్రీనివాస్, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మనుస్వామి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విజయనగర్‌కాలనీ: ర్యాగింగ్ రహిత విద్యాలయాలుగా తీర్చిదిద్దుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయవాది వి.సంగీత అన్నారు. బుధవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యాంటి ర్యాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయవాది సంగీత మాట్లాడుతూ..యూనివర్సిటీలో ఎవ్వరూ ర్యాగింగ్‌కు పాల్పడ వద్దని అటువంటి వారిపై చట్టపరమైన తీవ్రమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ హెచ్.చిన్న సైదులు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్

సమాజ సేవకే జీవితం అంకితం



ఆర్‌వి.రమణను సత్కరిస్తున్న ధన్‌రాజ్ తదితరులు

అబిడ్స్: సమాజ సేవకే తన జీవితం అంకితమని సంఘ సేవకుడు డాక్టర్ ఆర్‌వి.రమణ పేర్కొన్నారు. బుధవారం ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్.ధన్‌రాజ్ ఆధ్వర్యంలో ఆర్‌వి.రమణను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ..గోషామహల్ పరిసర ప్రాంతాల్లో పేదల కోసం నిరంతరం మరిన్ని సేవలందిస్తానన్నారు. ధన్‌రాజ్ మాట్లాడుతూ..20 ఏళ్లుగా జాంబాగ్ ప్రాంతాల్లో వేలాది మంది పేద ప్రజలకు రమణ అందించిన వైద్య సేవలు అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సురేష్ ముదిరాజ్, వెంకటేష్, లలిత్ జైన్, యోగేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లకు ఉచిత విద్యుత్ అందించాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర శిశు సంక్షేమ, పంచాయతి రాజ్‌శాఖ మంత్రి సీతక్కను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు అన్నింటికీ ఉచితంగా విద్యుత్ సరఫరా చేయిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. ఉచిత విద్యుత్ అందించేందుకు కృషి చేస్తాని హామీ ఇచ్చారు.

గోవు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ గోమాత గానామృతం కదంబమాల వీడియో సీడీ ఆవిష్కరణ మహోత్సవం బుధవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..గోవు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సువర్ణ భారతి గోశాల వ్యవస్థాపకుడు పి.శ్రీనివాస బంగారయ్య శర్మ, నవయుగ గ్రూప్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, సినీనటుడు ఎన్.గోపాల కృష్ణ, శ్రీశంకర విద్యాభారతి గో సంరక్షణ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కె.శ్రీనివాస ప్రసాద్ యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ కె.శివకుమార్, సాంస్కృతిక సంఘ సేవకులు రాధాకృష్ణ, ఏవి.రామారావు, శ్రీ భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సురేష్ పాల్గొన్నారు.



సీడీని ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ

సెయింట్ ఆన్స్‌లో న్యూట్రిజెనటిక్స్, పబ్లిక్ హెల్త్‌పై సదస్సు



గోల్కొండ: మెహిదీపట్నం సంతోష్‌నగర్ కాలనీలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూట్రిషన్ ఆధ్వర్యంలో న్యూట్రిజెనటిక్స్, పబ్లిక్ హెల్త్‌పై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్స్ డీన్ డాక్టర్ శ్రీకళ మాట్లాడుతూ..మానసిక సాంకేతిక శాస్త్ర రంగాల్లో ప్రతిఒక్కదాంట్లో న్యూట్రిజెనటిక్స్ ప్రాత ఉందన్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్‌లు ఈ నెక్స్ జెన్ న్యూట్రిషన్‌పై ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఈ సదస్సులో సాంకేతిక సెషన్‌లు నిర్వహించారు. డాక్టర్ జనని తమిళ్వానన్, డాక్టర్ దెబమల్కా బార్ ఆన్‌లైన్‌లో తమ సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల న్యూట్రిషన్ హెడ్ నస్రీన్ బేగం, జెనటిక్స్ హెడ్ డాక్టర్ వి.గోపాల్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.వి.ఫణీకుమారి, ఊరుజా డిర్జిస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

చార్మినార్: విద్యాశాఖ బడ్జెట్‌ను 7 నుంచి 15 శాతానికి పెంచాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను తాను కలిసి కోరనున్నట్లు తెలిపారు. బుధవారం చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో రూ.3.14 కోట్ల ఎంపీ లాడ్స్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఇందులో రెండు జిమ్స్, ఒక అంగన్ వాడీ భవనం, ప్రభుత్వ ఉర్దూ మీడియం హైస్కూల్ భవనం, కొత్త మోడల్ లైబ్రరీ.. ఇలా ఐదు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. విద్యాశాఖను మరింత పటిష్టం చేయడానికి ప్రతి ఏడాది విద్యాశాఖకు కేటాయిస్తున్న బడ్జెట్ సరిపోవటం లేదన్నారు. ప్రస్తుతం కేటాయిస్తున్న ఏడు శాతం బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

నాంపల్లిలో రౌడీషీటర్ హల్‌చల్

నాంపల్లి: పీడీ యాక్టులో జైలు కెళ్లి బయటకు వచ్చిన రౌడీషీటర్ హల్‌చల్ చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం..హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే అలీమ్ అలియాస్ అల్లూ (22) పీడీ యాక్టు కింద రెండుసార్లు జైలుకెళ్లాడు. అతడి సోదరులు సమీర్, ఖలీమ్ ఇద్దరు కూడా రౌడీషీటర్లే. అలీమ్ జైలుకు వెళ్లి ఇటీవలే బయటకు వచ్చాడు. బయటకు వచ్చిన అతడు మళ్లీ అరాచకాలను సృష్టిస్తున్నాడు. పాన్ షాపులు, హోటల్స్ మీద పడి మామూళ్లు వసూలు చేస్తున్నాడు. మామూళ్లు ఇవ్వకుంటే దాడులు చేస్తాడు. మంగళవారం రాత్రి నాంపల్లిలోని ఇందిరా టీ స్టాల్‌పై దాడి చేశాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హోటల్ నిర్వాహకులు తెలిపారు.